# సహజీవనం

ధనం అనే ఇంధనం లేకపోతే ఈ జీవన నావ సాగదని కొందరు ఆధునిక కవులు చెప్పారు. ధన సంపాదనకై ఐదేళ్ల కిందట గల్ఫ్ కంట్రీస్‌కి వెళ్లినవాణ్ని ఇటీవలే మాతృదేశానికి తిరిగి వచ్చాను.

శైశవ మిత్రుడు సుధీమణిని కలుద్దామని ఇంటివెళ్లేను.

గుర్రపు స్వారీ చేసేవాడు రౌతు. అతనికో బంటు వుంటాడు. ఆ బంటు అశ్వ సంరక్షణ చూసుకుంటాడు. రౌతుకి బంటు కనుక 'రౌతు బంటు' అనేది 'బంటురౌతు'గా తిరగబడి 'బంట్రోతు' అయిపోయింది. గేటు దగ్గర బంట్రోతు చెప్పాడు: "అయ్యగారు ఏకాంత సేవలో వున్నారు. ఎవరొచ్చినా ఇప్పుడు కలవరు"

సుధీమణి ఏకాంత సేవా? ఇదెప్పట్నుంచి? వీడు వేంకటేశ్వర స్వామి భక్తుడెప్పుడయాడు? వీడెప్పుడూ దేవుని అస్తిత్వాన్నే ఒప్పుకోడే!

"సరే- మీ ఫ్రెండ్ ప్రజ్ఞానిధి వచ్చాడని చెప్పు. సాయంత్రం వస్తాను" అని ఆ బంట్రోతుకి చెప్పేసి తిరుగుముఖం పట్టేను.

ఆరేళ్ల కిందట మాట. నేనింకా గల్ఫ్ కంట్రీస్‌కి పయనం కాలేదు.

"చూడు ప్రజ్ఞానిధీ! మహావిష్ణువు పది అవతారాలెత్తినట్లు చెప్పబడిందే? అందులో వేంకటేశ్వరస్వామి లేడేమి? అంటే అతడు తరువాత సృష్టించబడ్డ దేవుడు కాడా?" ప్రశ్నించాడు సుధీమణి.

"పోనీ నువ్వన్నట్లు దశావతారాల్లో వేంకటరమణమూర్తి లేడనుకో. పది అవతారాలు విష్ణుమూర్తి ఎత్తినట్లు నువ్వొప్పుకున్నా వన్నమాట!" అన్నాన్నేను.

"ఒప్పుకున్నట్టు కాదు. అవతారాలెత్తి నట్టు చెప్పబడింది అన్నాను. అంటే కల్పన అన్నమాట. అవి నిజంగా మహావిష్ణువు అవతారాలే అయితే, మనం చంపేసి కొన్నింటిని భోంచేస్తున్నాం ఎందుకు? చేపనీ, పందినీ పూజించడం లేదెందుకు?" అన్నాడు సుధీమణి.

"ఐతే ఈ సకల జీవ నిర్జీవ జాలాన్నీ, విశాల విశ్వాన్నీ సృజించిన మూలపదార్థం ఏదో లేకపోతే, సృష్టి ఎలా జరిగిందంటావ్?" అని అడిగేను.

"అదే నేనూ అడుగుతున్నాను. ఆ మూల పదార్థానికి మాత్రం మూలం వుండనవసరం లేదా?" ప్రశ్నించాడు సుధీమణి.

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే, ఇటువంటి చార్వాక బ్రహ్మ అయిన సుధీమణి, హఠాత్తుగా వేంకటేశ్వరస్వామి భక్తుడెలాగయాడా అని.

❁ ❁ ❁

సాయంత్రం ఐదు గంటలకి వెళ్లి నేను వచ్చినట్టు చెప్పమన్నాను బంట్రోతుతో.

కంచిలో వరదరాజస్వామికి వాహనమైన గరుత్మంతుడు నిరంతరం స్వామి సేవలో నిమగ్నమై వుంటాడు. కారణం? గతంలో, ఆపదలో వున్న గజేంద్రుణ్ని రక్షించడానికి, తనని బయలుదేరమని చెప్పకుండానే, గజేంద్రుని ఆర్తనాదం విని, స్వామి ఒక్కడే పయనమయాడు. అది చూచి గరుడునికి ఎంతో క్షోభ కలిగింది. తాను స్వామి వారికి వాహనం అయుండి ప్రయోజనమేమిటి? ఏక్షణంలో ఏభక్తుని ఆర్తనాదం విని ఆకస్మికంగా శ్రీహరి బయలుదేరుతాడో, ఆ క్షణమే స్వామిని తన వీపు మీద కూర్చుంబెట్టి ఆ భక్తుని రక్షించడానికి తాను తీసుకువెళ్లాలని, నిరంతరం స్వామి సన్నిధిలో గరుత్మంతుడు సేవ చేస్తూనే వున్నాడు. ఆ విధంగా 'కంచి గరుడసేవ' అనే పదం వాడుకలోకి వచ్చింది.

అలా కంచిలోని గరుడునిలా, సుధీమణి గేటు దగ్గర వాడి పిలుపుకోసం ఎదురు చూస్తున్నాను.

అరగంట పోయేక లోపలికి రమ్మని పిలుపు వచ్చింది.

సుధీమణి బయటకు వచ్చి కుచేలుణ్ని కృష్ణుడు ఆహ్వానించినట్టు సాదరంగా నన్ను ఆహ్వానించాడు. వాడి పక్కని ఎవరో స్త్రీ మూర్తి వుంది. లోపల సోఫా మీద కూర్చున్నాను.

"నువ్వు ఏకాంత సేవలో వున్నావని విని ఆశ్చర్యపోయామురా, వేంకటేశ్వరస్వామి భక్తుడి వెప్పుడయావా అని!" అన్నాను.

"అక్కడే పొరపాటు పడ్డావు నువ్వు! ఈమె నా అర్ధాంగి చంద్రకాంతం. ఈ కాంతతోనే ఉదయం ఏ 'కాంత' సేవలో నిమగ్నమై వున్నాను. నాలో ఇప్పటికీ దేవుడి పట్ల నమ్మకం కలగలేదు. నేను మునుపటి నాస్తికుణ్నే!" అన్నాడు సుధీమణి.

"అమ్మయ్య! రక్షించావు. ఏకాంత సేవ నీ కులకాంతతోనా?" చోద్యపడ్డాన్నేను.

నిజమే. ఎవరి అభిప్రాయాలు వారివి. సుధీమణిలోని 'నాస్తికత్వం' అనే నిశ్చితాభిప్రాయాలు నేను హర్షిస్తున్నాను. నాస్తికులైన వారు మూర్ఖులు అని ఆస్తికులంటే, ఆస్తికులైన వారే మూర్ఖులని నాస్తికులనరూ? అంచేత ఉభయులూ ఒకరి అభిప్రాయాలనొకరు మన్నించుకుంటూ సహజీవనం సాగించడంలోనే వుంది గొప్ప దనమంతా! దేవుని అస్తిత్వం విషయంలో అభిప్రాయాలున్నా మానవతా దృక్పథం, సేవా తత్పరత కలిగి వుండడంలో ఇరువురికీ అభిప్రాయ భేదాలు లేవుకదా?

"ఆస్తికత్వం, నాస్తికత్వం నాణానికి బొమ్మా బొరుసూను. ఏది లేకపోయినా నాణం మారదు" ఆచార్య వినోబాభావే, నాస్తిక బ్రహ్మగో.రా. గారితో అన్న మాటలివి.

ఇది అక్షరాలా నిజం!

• ఆంధ్రభూమి దినపత్రిక – నేటికథ •

5–5–1992